సాక్షి నల్లగొండ

శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



విషాద ఛాయలు

దండుమల్కాపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంతో దేవలమ్మనాగారంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

- 8లో



వైభవంగా ధ్వజారోహణం

యాదాద్రి కొండపైన ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

- 10లో

గరిష్ఠం/కనిష్ఠం 35°/17°

వాతావరణం

ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తు చేసుకోండి

నల్లగొండ: అర్హులైన దివ్యాంగులు ప్రభుత్వం మంజూరు చేసే రుణాలు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారిణి సుభద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీలోగా ఆన్‌లైన్‌లో tsobmmsog.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు..

దేవరకొండలోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్, హిస్టరీ సబ్జెక్టులను ఆంగ్ల మాద్యమంలో బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ల కోసం అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గిరిజన గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారి లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు నల్లగొండలోని తమ కార్యాలయంలో దరఖాస్తు ఫారం పొందొ. అర్హత ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 17 నుంచి 23 తేదీ సాయంత్రం 5గంటల వరకు కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. ఈనెల 25న ఉదయం 11గంటలకు కార్యాలయంలో డెమో, ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తామని తెలిపారు.

విజయం సాధించాలి



పోటీలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

నల్లగొండ టూటౌన్: రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో విజయం సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలని అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి మహిళల చెస్ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నందున అక్కడి పోటీల్లో రాణించేలా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి మక్బుల్ అహ్మద్, చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రెండో రోజు ప్రాక్టికల్స్‌కు 285 మంది గైర్హాజర్

నల్లగొండ: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్ కేటగిరీల్లో గురువారం రెండో రోజు జరిగిన ప్రాక్టికల్స్‌కు 285 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 3,483 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 3,198 మంది మాత్రమే హాజయ్యారు. పట్టణంలోని పరీక్ష కేంద్రాలను డీఐఈఓ దస్రూనాయక్ తనిఖీ చేశారు.

పన్ను చెల్లించకుంటే అధిక జరిమానా



ఆర్‌టీఓ సురేష్‌రెడ్డి

నల్లగొండ: వాహనాల పన్ను చెల్లించకుంటే జరిమానాలు విధిస్తామని ఆర్‌టీఓ సురేష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. జిల్లాలో 11,193 వాహనదారులు పన్నులు చెల్లించకుండా తిరుగుతున్నారని అలాంటి వారు తనిఖీల్లో దొరికితే 200 శాతం అధిక అపరాధ రుసుముతో మొత్తం 300 శాతం పన్ను చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆయా వాహనాలకు సంబంధించి రూ.11 కోట్ల పన్ను బకాయిలు ఉన్నాయన్నారు. కాబట్టి వాహనదారులు వెంటనే పన్ను చెల్లించాలని కోరారు. దళితబంధు లబ్ధిదారులు, గ్రామపంచాయతీ వాహనాలకు సంబంధించిన వారు కూడా సత్వరమే తమ వాహనాల పన్నులు చెల్లించాలని సూచించారు.

చేయూతనిచ్చేలా..

- గొర్రెలు, కోళ్ల యూనిట్ల ఏర్పాటుకు ఎన్‌ఎల్‌ఎం అమలు
- పెంపకందారులకు బాసటగా కేంద్రం
- గొల్లకుర్మలతోపాటు అన్ని సామాజిక వర్గాలకూ వర్తించనున్న పథకం
- యూనిట్ విలువ రూ.12లక్షల నుంచి రూ.కోటి వరకు..
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ



నల్లగొండ అగ్రికల్చర్: దేశంలో మాంసం ఉత్పత్తులను పెంచుతూ జీవాల పెంపకందారులకు చేయూతనివ్వాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్(ఎన్‌ఎల్‌ఎం) పథకం ద్వారా గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకానికి ప్రోత్సాహం ఇవ్వాలని భావిస్తోంది. దీంట్లో భాగంగా ఒక్క యూనిట్ స్థాపనకు 50 శాతం సబ్సిడీతో రూ.12లక్షల నుంచి రూ.కోటి వరకు రుణాలు అందించాలని నిర్ణయించింది. గొల్లకుర్మలకే కాకుండా అన్ని సామాజిక వర్గాలకు చెందిన వారు కూడా అర్హులుగా ప్రకటించింది. పశుసంవర్ధక శాఖ ద్వారా ఈ పథకాన్ని అమలుకు శ్రీకారం చుట్టింది.

యూనిట్ విలువ ఎక్కువగా ఉండడంతో..

నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ద్వారా ఇంతకు ముందు రూ.కోటి విలువైన యూనిట్లు మాత్రమే మంజూరు చేసేవారు. అందులో రూ.50 లక్షలు సబ్సిడీ, రూ.40లక్షల బ్యాంకు రుణం, రూ.10లక్షల లబ్ధిదారుని వాటాగా ఉండేది. ఈ యూనిట్ కింద 500 గొర్రెలు, 25 పొట్టేళ్లు ఇచ్చేవారు. యూనిట్ విలువ ఎక్కువగా ఉండడం వలన బ్యాంక్‌లు షూరిటీ లేకుండా రుణాలను ఇవ్వడం లేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం గొర్రెల యూనిట్లను ఐదుగా విభజించి రుణాలను అందజేయాలని ఇటీవల ఎన్‌ఎల్‌ఎం నిబంధనలు సడలించింది. దీని ప్రకారం 105 గొర్రెల నుంచి 525 గొర్రెల వరకు రూ.12 లక్షల నుంచి రూ.కోటి వరకు రుణాలు ఇస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 27 మంది పెంపకందారులు పథకానికి దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో ఐదుగురికి యూనిట్లు మంజూరు కూడా చేశారు.

యూనిట్ల విభజన ఇలా..

గొర్రెలు	విలువ(రూ.లక్షల్లో..)
105	12
210	40
315	60
429	80
525	రూ.కోటి వరకు

దేశవాళి కోళ్లకు రూ.50లక్షల చొప్పున..

గొర్రెలు, మేకలే కాకుండా దేశవాళి కోళ్లు, పందుల పెంపకానికి కూడా రూ.50లక్షల యూనిట్ ఇవ్వాలని నిర్ణయించారు. ఎంపిక చేసుకున్న యూనిట్‌నుబట్టి రెండు ఎకరాల నుంచి పదిఎకరాల భూమి అవసరం ఉంటుంది. సొంత భూమి లేకుంటే లీజుకు తీసుకోవచ్చు. చుట్టూ ఫెన్సింగ్‌వేసి, షెడ్లు నిర్మించి అందులోని మేత పెంపకం చేసుకోవాలి. బ్యాంకు లోన్ కోసం కాన్సెంట్ తీసుకువాలని అన్ని ఒరిజినల్ డ్యాంకుమెట్లు జత చేస్తూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకోవాలి. nlm.udayamimitra.in వెబ్‌సైట్‌లో దరఖాస్తుల చేసుకుని దరఖాస్తు హార్డ్ కాపీలను నల్లగొండ జిల్లా కేంద్రంలోని జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. దీనికి చివరి గడువు అనేది ఏదీ లేదు. ఎప్పుడైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటును కేంద్ర ప్రభుత్వం కల్పించింది.

సద్వినియోగం చేసుకోవాలి



పెంపకం దారులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ సబ్సిడీ పథకాన్ని సద్వినియోగం చేసకోవాలి. 50శాతం సబ్సిడీని ఇస్తున్నందున పెంపకం దారులకు ఉపయుక్తంగా ఉంటుంది. ఇప్పటి వరకు 27 మంది దరఖాస్తు చేసుకుంటే ఐదుగురికి మంజూరయ్యాయి.

– డాక్టర్ అంబటి యాదగిరి, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి

ఎంపిక విధానం..

ఎన్‌ఎల్‌ఎంకు రాష్ట్ర స్థాయిలో పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ లోడల్ అధికారిగా వ్యవహరిస్తారు, లబ్ధిదారుల ఎంపికకు రాష్ట్ర, కేంద్ర స్థాయిలో రెండు కమిటీలు ఉంటాయి. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు, బ్యాంకు రుణం మంజూరైన తర్వాత 25 శాతం, యూనిట్ గ్రౌండింగైన తర్వాత 25 శాతం సబ్సిడీని బ్యాంకులో జమచేస్తారు, బ్యాంకు రుణం అవసరం లేనివారు సొంతంగా పెట్టుబడి పెట్టి ఏర్పాటు చేసుకున్నా సబ్సిడీ పొందవచ్చు.

సీఎం బర్త్ డే ఘనంగా నిర్వహించాలి



ఏర్పాట్లపై ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులకు సూచనలు చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- నల్లగొండలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాట్ల పరిశీలన

నల్లగొండ టూటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేసీఆర్ బర్త్ డే సందర్భంగా నల్లగొండలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం తలపెట్టిన మెగా రక్తదాన శిబిరానికి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. గురువారం రాత్రి ఆయన నల్లగొండ పట్టణంలోని వీటికాలనీలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. నియోజకవర్గాల వారీగా టేబుళ్లు ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డికి సూచించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ 700 మందికి పైగా రక్తదానం చేస్తారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి దేశ ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు అభిమన్య శ్రీనివాస్ , పున్న గణేష్, నాయకులు కటికం సత్తయ్యగౌడ్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, కొండూరు సత్యనారాయణ, జమాల్‌ఖాద్రి, భువనగిరి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి పోస్టల్ సేవలపై ప్రచారం

మిర్యాలగూడ: ఈనెల 20 నుంచి ఐదు రోజుల పాటు తపాలా (పోస్టల్) శాఖ అందించే సేవలపై ప్రచారం చేయనున్నట్లు సూర్యాపేట పోస్టల్ సూపరింటెండెంట్ వి.వెంకటేశ్వర్లు అన్నారు. వేములపల్లికి చెందిన కలకొండ అంజయ్య ఇటీవల మృతిచెందగా పోస్టాఫీస్‌లో అతను చేయించుకున్న ప్రమా ద బీమా కింద మంజూరైన రూ.10లక్షల చెక్కును అతని కుటుంబానికి ఎంపీపీ పుట్టల సునీతతో కలిసి ఆయన అందజేసి మాట్లాడారు. సంవత్సరానికి రూ.399 ప్రీమియం చెల్లించి ఏడాదిలోపు ప్రమాదవశాత్తు మృతిచెందితే వారి కుటుంబానికి 10లక్షల రూపాయలు అందజేయబడతాయన్నారు. పోస్టల్ శాఖ ద్వారా అందించే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిర్ర మల్లయ్యయాదవ్, పోస్టల్ అధికారులు, సిబ్బంది నయీమొద్దీన్, ప్రతాప్‌సింగ్, భాస్కర్‌నాయక్, స్వాతి, కల్యాణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ లబ్ధిదారుల ఎంపిక వేగిరం చేస్తాం

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు

నల్లగొండ: జిల్లాలో నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ పట్టణ ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక చేసి వారి పేర్లను పోర్టల్‌లో అప్లోడ్ చేస్తామని జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులతో కలిసి కంటి వెలుగు, పోడు భూములు, డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఎంపిక, తెలంగాణకు హరితహారంపై కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎస్ వివిధ అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఖుష్బూ గుప్తా, భాస్కర్ రావు, డీఎఫ్ఓ రాంబాబు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు, గృహ నిర్మాణ పీడీ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడదాం

- మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి



అనుములలో చేపట్టిన జోడో యాత్రలో మాట్లాడుతున్న కుందూరు జానారెడ్డి

హాలియా: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడదామని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అనుముల గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన హాథ్ సే హాథ్ జోడో యాత్రను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని కేసీఆర్ పోలీసుల ద్వారా కాంగ్రెస్ నేతలను బెదిరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరించిందన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, రైతులకు రుణమాఫీ, దళితులకు మూడెకరాల భూ పంపిణీ హామీ ఏమైందని ప్రశ్నించారు. దళితబంధు పథకం పేరుతో దళితులను మరోమారు మోసం చేసేందుకు సిద్ధమైందన్నారు. లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనన్నారు. అనుముల గ్రామ ప్రజల దీవెనలతో రాష్ట్రానికి సేవ చేసే భాగ్యం నాకు దక్కిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణ గౌడ్, అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజా రమేష్ యాదవ్, జిల్లా సహాయ కార్యదర్శి పాదిల కృష్ణ, పట్టణ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, ఎస్టీ, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు పాండు నాయక్, మజహర్ మొహినొద్దీన్, ఓబీసీ అధ్యక్షుడు కుకుడాల ఆంజనేయులు నాయకులు కుందూరు రాజేందర్‌రెడ్డి, జూపల్లి శ్రీనివాస్, నెర్మటి వెంకట్‌రెడ్డి, వర్కాల శ్రీనివాస్‌రెడ్డి, తక్కెళ్లపల్లి సైదులు, పిల్లి ఆంజనేయులు, నకిరేకంటి సైదులు, యడవెల్లి సోమశేఖర్, రంజిత్‌కుమార్, బొంగరాల ఏసురాజు, గడ్డం రమణయ్య, గోవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

‘ఫార్మా’ అనుమతులు రద్దుచేయాలి

- మునుగోడులో అఖిలపక్ష నాయకుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న అఖిల పక్ష నాయకులు

మునుగోడు: ప్రజల ప్రాణాలకు, పంటలకు హాని కలిగించే ఫార్మా కంపెనీని రద్దు చేసేంతవరకు అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగిస్తామని వివిధ పార్టీలు, సంఘాల నాయకులు తేల్చి చెప్పారు. మునుగోడు మండలం కిష్టాపురం గ్రామ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న సస్‌లైట్ యాక్టివ్ డ్రగ్స్ ఇంగ్రీడియన్స్ ప్రైవేట్ ఫార్మా కంపెనీ అనుమతులు వెంటనే రద్దు చేయాలనే డిమాండ్‌తో గురువారం మునుగోడులో అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, టీఆర్‌ఎస్, బీజేపీ, బీసీ సంక్షేమ సంఘం, ఇతర సంఘాల నాయకులు హాజరై మాట్లాడారు. ఇప్పటికే ఎలాంటి సాగు నీటి వనరులు లేకుండా ఫ్లోరిన్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ఫార్మా కాలుష్యాన్ని వెదజల్లేలా చేయాలని చూడడం దారుణమన్నారు. కంపెనీ నిర్మాణం చేపడితే పంటలు దెబ్బతినడంతో పాటు ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం పొంచిందని వాపోయారు. ఈ సమస్యను ప్రభుత్వం గుర్తించి వెంటనే ఫర్మా కంపెనీ అనుమతులు రద్దు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని కోరారు. ప్రభుత్వాలు ప్రజల అభిప్రాయాలు తీసుకొని కంపెనీల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలి తప్ప ఇష్టానుసారంగా ఇవ్వడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా ప్రజారోగ్యం దృష్ట్యా కంపెనీ అనుమతులు రద్దు చేసి ప్రజలకు అండగా నిలవాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, ఎంపీపీ కర్నాటి స్వామి, ఏఐసీసీ సభ్యురాలు పాల్వాయి స్రవంతి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పున్న కైలాస్‌నేత, చెల్లమల్ల కృష్ణారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుర్జ రామచంద్రం, సర్పంచ్‌లు మిర్యాల వెంకన్న, జాజుల పారిజాతసత్యనారాయణ, సురిగి చలపతి, జక్కలి శ్రీను, తాటికొండ సంతోషసైదులు, బొజ్జ సుజాతశ్రీను, నకిరేకంటి పద్మయాదయ్య, గజ్జల బాలరాజు, వైఎస్ ఎంపీపీ అనంత వీణలింగస్వామి, ఎంపీటీసీలు భీమనపల్లి సైదులు, చాపల మారయ్య, పోలగోని విజయలక్ష్మిసైదులు, ఈద నిర్మలశరత్‌బాబు, చెరుకు కృష్ణయ్య, కోఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీక్, ఈదులకంటి కైలాస్, బండా శ్రీశైలం, తిరిపారి వెంకటేశ్వర్లు, మేకల ప్రదీప్‌రెడ్డి, సురిగి నర్సింహగౌడ్, మారగోని అంజయ్యగౌడ్, పోలగోని సత్యంగౌడ్, ఆనగంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

బాలుడి కడుపులో నుంచి మేకు తొలగింపు


అఖిల్ తల్లిదండ్రులతో వైద్యులు


ఇనుప మేకు

నల్లగొండ టౌన్ : మూడు సంవత్సరాల బాలుడి కడుపులో ఉన్న ఇనుప మేకును గురువారం నల్లగొండ పట్టణంలోని ఆర్‌కే హాస్పిటల్‌లో వైద్యులు తొలగించారు. నాంపల్లి మండలం పెద్దాపురం గ్రామానికి చెందిన నాగరాజు, రజితల కుమారుడు అఖిల్ ఇనుప మేకును మింగాడు. గమనించిన తల్లిదండ్రులు వెంటనే పట్టణంలోని ఆర్‌కే హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. డాక్టర్ కీర్తిరెడ్డి స్కానింగ్ చేసి ఎండోస్కోపి ద్వారా కడుపులో నుంచి ఇనుప మేకును తొలగించారు. ఈ మేకు సమారు 7 సెంటీమీటర్ల పొడవు ఉంది.

తప్పిపోయిన బాలుడి అప్పగింత


బాలుడిని అప్పగిస్తున్న వెంకటేశం

భువనగిరిటౌన్ : తప్పిపోయిన బాలుడిని గురువారం వారి బంధువులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. జనగాం జిల్లా వడిచెర్ల గ్రామానికి చెందిన సాతల్లి యాకయ్య కుమారుడు భరత్‌కుమార్(12) వడిచెర్ల గ్రామంలోని మై మాస్టర్ పబ్లిక్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం 8 గంటలకు బడికి వెళ్లకుండా జనగాం బస్టాండ్‌కు చేరుకుని, బస్సు ఎక్కి భువనగిరికి వచ్చాడు. భువనగిరిలో ఎక్కడికి వెళ్లాలో తెలియక పట్టణంలోని శ్రీజ గ్యాస్ రిపేరింగ్ షాప్ వద్దకు వచ్చి కూర్చున్నాడు. షాపు నిర్వాహకుడు ఉడుత రవి బాలుడిని చేరదీసి బాలల హక్కుల సంఘం నాయకుడు కొడారి వెంకటేశంకు సమాచారం ఇచ్చాడు. ఆయన బాలుడి వివరాలు తెలుసుకుని అతడి బంధువులైన భువనగిరి మండలం బొమ్మాయిపల్లికి చెందిన చింతల మల్లేష్‌కు సమాచారం ఇచ్చి బాలుడిని అప్పగించారు. అనంతరం బాలుడి తండ్రి యాకయ్యతో మాట్లాడి బంధువులకు అప్పగించిన విషయం తెలియజేశారు.

చోరీ కేసులో రెండేళ్ల జైలు

కోదాడరూరల్ : తాళం వేసిన ఇళ్లల్లో చోరీకి పాల్పడుతున్న ఓ నిందితుడికి కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించినట్లు డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. కోదాడ పట్టణానికి చెందిన అబ్దుల్లా అలియాస్ సంగిశెట్టి అనే వ్యక్తి పట్టణంలో తాళం వేసిన ఇళ్లను గుర్తించి చోరీకి పాల్పడుతున్న సంఘటనల్లో అతడిపై ఇదివరకే పలు కేసులు ఉన్నాయి. రెండు నెలల క్రితం నయానగర్‌లోని ఓ ఇంటిలో గ్యాస్ సిలిండర్ చోరీకి పాల్పడగా బాధితురాలి ఫిర్యాదు మేరకు పట్టణ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు విచారణ చేపట్టి నిందితుడిని గుర్తించారు. అతడిని కోర్టులో హాజరుపరచగా జడ్జి నిందితుడికి రెండేళ్ల జైలు, రూ.100 జరిమానా విధించినట్లు డీఎస్పీ తెలిపారు.

దేవలమ్మనాగారంలో విషాద ఛాయలు

- చౌటుప్పల్ మండలంలోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళలు మృతి
- రెండు నిమిషాల్లో కంపెనీకి చేరుకుంటామనగా కబళించిన మృత్యువు
- విధులు బహిష్కరించి నిరసన తెలిపిన సహచర మహిళా కార్మికులు
- న్యాయం చేయాలని కంపెనీ వద్ద బైఠాయించిన గ్రామస్తులు

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండలంలోని దండుమల్కాపురం గ్రామంలో ఉన్న గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని దేవలమ్మనాగారం గ్రామానికి చెందిన నలుగురు మహిళలు డాకోజి నాగలక్ష్మి(28), వరకాంతం అనసూయ(55), సిలివేరు ధనలక్ష్మి (35), దేవరపల్లి శిరీష(30)లు మృతిచెందారు. అంతేకాకుండా ఆటోడ్రైవర్ కొండ వెంకటేష్‌తో పాటు బుట్టి యామిని, కొండ కావ్య, కొయగూర అఖిల తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో దేవలమ్మనాగారం గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. మృతుల కుటుంబాలు, బంధువులు, గ్రామస్తుల రోదనలు మిన్నంటాయి. రెక్కాడితేగాని డొక్కాడని నాలుగు కుటుంబాల్లో చీకట్లు కమ్ముకున్నాయి. తల్లుల మరణంతో వారి పిల్లలు అనాథలుగా మారారు. ఒక్కో బాధిత కుటుంబానిది ఒక్కో విషాదగాథగా మిగిలింది. మృతుల్లోని నాగలక్ష్మి ఇళ్లు మినహా మిలిగిన ముగ్గురి ఇళ్లు జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో పక్కపక్కనే ఉన్నాయి.

పండుగ కారణంగా వెళ్లని ఆటోడ్రైవర్

గ్రామం నుంచి మహిళా కార్మికులను తీసుకువెళ్లేందుకు గ్రామానికి చెందిన ఆటోను ఏర్పాటు చేసుకున్నారు. కంపెనీకి వెళ్లే మహిళలంతా పొట్ట వెంకటేష్ ఆటోలో వెళ్తుంటారు. గురువారం తన ఇంట్లో దేవుడి పండుగ ఉన్న కారణంగా వెళ్లలేదు. ప్రత్యామ్నాయంగా అదే గ్రామానికి చెందిన కొండ వెంకటేష్‌ను మాట్లాడారు. అతడి ఆటో ద్వారా కంపెనీకి మహిళలను తరలించే ఏర్పాటు చేశాడు.

నలుగురిని బలిగొన్న కంపెనీ నిబంధన

శ్వేత తెలుగు ఫుడ్స్(పచ్చళ్ల కంపెనీ) నిబంధన నలుగురు మహిళా కార్మికులను బలిగొంది. కఠినమైన నిబంధనలు లేకపోతే వారి ప్రాణాలు దక్కేవని పలువురు పేర్కొంటున్నారు. కంపెనీలో పని చేసే కార్మికులు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉంది. ఉదయం ఒక్క నిమిషం ఆలస్యమైనా గైర్హాజరుగా పరిగణిస్తారు. అదే విధంగా ఒక్కొక్కరు వరుసగా పదిహేను రోజుల పాటు విధులకు హాజరైతేనే వారికి రోజులు రూ.300 చొప్పున కూలి చెల్లిస్తారు. ఏ ఒక్క రోజు పనికి రాకపోయినా అన్ని పని దినాలకు రోజుకు రూ.265 మాత్రమే చెల్లించే నిబంధన పెట్టారు. దీంతో ఏడుగురు కార్మికులు తప్పనిసరి పరిస్థితుల్లో కంపెనీకి వెళ్లాల్సి వచ్చింది. శివరాత్రి పండుగ నేపథ్యంలో ఇంటి వద్దే ఉండి శుభ్రత కార్యక్రమాలు చేసుకోవాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యం నిబంధనలు వారిని కంపెనీకి వెళ్లేలా చేశాయి.


ఆటోను ఢీకొట్టిన బస్సు

భర్త బోరు బండిపై.. భార్య పచ్చళ్ల కంపెనీకి..

సిలివేరు ధనలక్ష్మి-భిక్షపతి దంపతులది నిరుపేద కుటుంబం. భిక్షపతి జీవనోపాధి కోసం బోరుబండిపై డ్రిల్లర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఇంటర్ చదివే కుమారుడు భరత్‌కుమార్, పదో తరగతి చదువుతున్న కుమార్తె హర్షిత ఉన్నారు. భర్తకు భారం తగ్గించాలన్న ఆలోచనతో ధనలక్ష్మి పనికి వెళ్తోంది. అందులో భాగంగా కొంత కాలంగా పచ్చళ్ల కంపెనీకి వెళ్తూ ప్రమాదంలో మృత్యువాత పడింది. ప్రమాదం జరిగిన సమయంలో భర్త సంగారెడ్డిలోని బోరు బండి వద్ద, పిల్లలు చదువుకునేందుకు వెళ్లారు.


విధులు బహిష్కరించి ఘటనా స్థలం వద్ద కూర్చున్న కంపెనీ కార్మికులు

ఫలితంగా ఏడుగురిలో నలుగురు మృత్యువాత పడ్డారు. ఇంటి వద్దే ఉండిపోయిన మరో ఎనిమిది మంది మహిళలు ప్రాణాలు దక్కించుకున్నారు.

పచ్చళ్ల కంపెనీ వద్ద ఆందోళన

రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో పచ్చళ్ల కంపెనీలో వందలాది మంది కార్మికులు ఉన్నారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే కార్మికులు ఘటనా స్థలానికి వెళ్లారు. క్షతగాత్రులను హుటాహుటిన చికిత్స నిమిత్తం కంపెనీకి చెందిన వాహనాల్లో హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. బాధిత కుటుంబాలకు, క్షతగాత్రులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు పచ్చళ్ల కంపెనీ వద్ద బైఠాయించారు. చికిత్స పొందుతూ మృతిచెందిన దేవరపల్లి శిరీష మృతదేహాన్ని కంపెనీ ఎదుట ఉంచారు. మృతులు డాకోజి నాగలక్ష్మి, సిలివేరు ధనలక్ష్మి, వరకాంతం అనసూయ కుటుంబీకులు, గ్రామస్తులతో కలిసి సహచర కార్మికులు ఆందోళనలో పాల్గొన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి, ఏఐసీసీ సభ్యురాలు పాల్వాయి స్రవంతిలు ఆందోళనకు వేర్వేరుగా మద్దతు తెలిపారు. మృతులు, క్షతగాత్రులకు పరిహారం చెల్లించేందుకు కంపెనీ యాజమాన్యం అంగీకరించడంతో ఆందోళన విరమించారు.


మార్చురీలో మృతదేహాలు


రోదిస్తున్న మృతురాలు అనసూయ మామ


రోదిస్తున్న మృతురాలు నాగలక్ష్మి మామ శ్రీను

అనాథలైన ముగ్గురు చిన్నారులు

ప్రమాదంలో మృతిచెందిన డాకోజి నాగలక్ష్మి (28)కి భర్త రమేష్‌తో పాటు ఆరేళ్ల లోపు వయసు కలిగిన ముగ్గురు పిల్లలు నిఖిల్, సాత్విక్, సమీక్ష ఉన్నారు. వీరిది నిరుపేద నాయీబ్రాహ్మణ కుటుంబం. భర్త కులవృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తాను సైతం చేదోడువాదోడుగా ఉండాలన్న కోరికతో నాగలక్ష్మి గత కొంతకాలంగా పచ్చళ్ల కంపెనీకి వెళ్తుంది. రోడ్డు ప్రమాదంలో ఈమె మృతిచెందడంతో ముగ్గురు చిన్నారులు అనాథలయ్యారు.

ఆసరా అవ్వాలని వెళ్లి..

వరకాంతం అనసూయ-రాంరెడ్డి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వారందరికీ వివాహాలు జరిగాయి. నిరుపేద కుటుంబం కావడంతో స్థానికంగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. భర్త గ్రామంలోని ఓ వెంచర్‌లో పని చేస్తున్నాడు. కుటుంబానికి తాను కూడా ఆసరా అవ్వాలని అనసూయ గత కొంత కాలంగా కంపెనీకి వెళ్తోంది. రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో భర్త ఒంటరయ్యాడు.

అమ్మను కోల్పోయిన బాలుడు

దేవులమ్మనాగారం గ్రామానికి చెందిన దేవరపల్లి శిరీష-శేఖర్‌రెడ్డి దంపతులకు తొమ్మిదేళ్ల కుమారుడు ఉన్నాడు. భర్త ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. తాను ఒక్కడే కష్టపడుతుండడంతో చూడలేక భార్య శిరీష కొంత కాలంగా ఉపాధి నిమిత్తం పచ్చళ్ల కంపెనీకి వెళ్తుంది. భర్త పనినిమిత్తం వెళ్లగా కుమారుడిని స్కూల్‌కు పంపించిన శిరీష ఆటోలో కంపెనీకి బయలుదేరింది. మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మృతిచెందడంతో ఒక్కగానొక్క కుమారుడు అనాథగా మారాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎస్ఐ దోరేపల్లి నర్సింహులు

మిర్యాలగూడ టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి మిర్యాలగూడ మండలంలోని కొత్తగూడెం వద్ద చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ దోరేపల్లి నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం గ్రామ సమీపంలో గల అద్దంకి- నార్కట్‌పల్లి రోడ్డుపై గల హోటల్‌కు అర్ధరాత్రి సమయంలో మతిస్థిమితం లేని దేవనూరి నవీన్ (35) గుంటూరు నుంచి మిర్యాలగూడ వైపు రోడ్డుపై పరిగెత్తుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో లక్ష్మయ్య పొలం వద్ద రోడ్డు దాటుతుండగా గుంటూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో నవీన్ కిందపడిపోయాడు. అతడి పైనుంచి వాహనాలు వెళ్లడంతోపాటు, సుమారు 30 మీటర్ల మేరకు మృతదేహాన్ని ఓ వాహనం లాక్కెళ్లడంతో తల, మొండెం, చేతులు విడిపోయి శరీరం ఛిద్రమైంది. స్థానికుల సమాచారం మేరకు మిర్యాలగూడ రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాద వివరాలను హోటల్ వారిని అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా.. మృతుడు నవీన్ సొంతూరు ముంబాయి కాగా ప్రస్తుతం విజయవాడలో నివాసం ఉంటున్నాడు. ఇతడిని విజయవాడలో తన బావ లోకమాన్య తిలక్ ట్రీట్‌మెంట్ కోసం ట్రైన్ ఎక్కించగా అతను ముంబాయి వెళ్లకుండా మిర్యాలగూడ వైపు వచ్చాడు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీకి యత్నం

- గట్టిగా అరవడంతో అప్రమత్తమైన స్థానికులు
- నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత


చైన్ స్నాచర్‌కు దేహశుద్ధి చేస్తున్న కాలనీవాసులు

మిర్యాలగూడ అర్బన్: నడిచి వెళ్తున్న వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును లాక్కొని పారిపోతున్న ఓ యువకుడిని స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన గురువారం మిర్యాలగూడ పట్టణంలోని శాంతినగర్‌లో చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ నిగిడాల సురేష్ కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో నివాసముంటున్న మేకల నీలమ్మ తన కూతురు ఇంటికి నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో ఆమె వెనుక నుంచి వచ్చిన ఓ యువకుడు వృద్ధురాలి మెడలోని 4 తులాల బంగారు గొలుసును లాక్కొని అక్కడి నుంచి పరిగెత్తాడు. దీంతో నీలమ్మ గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు ఆ యువకుడిని పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ యువకుడిని స్టేషన్‌కు తరలించారు. వృద్ధురాలు నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా.. చోరీకి పాల్పడిన యువకుడు హైదరాబాద్‌లోని మొఘల్‌పురకు చెందిన ఇర్ఫాన్‌గా గుర్తించామని, పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని సీఐ సురేష్ కుమార్ తెలిపారు.

మహాశివరాత్రికి వాడపల్లికి 15 బస్సులు


మాట్లాడుతున్న డీఎం బొల్లెద్దు పాల్

మిర్యాలగూడ టౌన్ : ఈనెల 18న మహాశివరాత్రి సందర్భంగా మిర్యాలగూడ డిపో నుంచి వాడపల్లికి 15 ఆర్టీసీ బస్సులు నడిపిస్తున్నామని ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్ అన్నారు. గురువారం మిర్యాలగూడలోని చాంబర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దామరచర్ల మండలంలోని వాడపల్లి కృష్ణ-మూసీనది సంగమం, ఆగస్తేశ్వరస్వామి టెంపుల్ వరకు బస్సులను నడిపించడం జరుగుతుందని తెలిపారు. ఈ 15 బస్సులు 60 ట్రిప్పులు తిరుగుతాయని చెప్పారు. మిర్యాలగూడ నుంచి అన్నారం సూర్యాపేట నుంచి సోమారం మీదుగా సోమప్పకు ప్రతి నిత్యం నడిచే బస్సులు కాకుండా మరో రెండు బస్సులను సోమప్ప వరకు తిప్పడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మిర్యాలగూడ నుంచి శ్రీశైలానికి రెండు బస్సులను ఉదయం 10గంటలకు, 12 గంటలకు నడిపిస్తున్నామని పేర్కొన్నారు.

సోషల్‌మీడియాలో డీసీసీ అధ్యక్షుడి సంభాషణ వీడియో వైరల్

మిర్యాలగూడ: డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్ నాయక్ ఆరోపణలపై ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. మిర్యాలగూడలోని ఓ వ్యాపారి నుంచి రూ.5లక్షలు డిమాండ్ చేస్తున్నట్లు ఆ వీడియోలో ఉంది. ఓ ప్రజాప్రతినిధికి నెలకు మామూళ్లు ఇస్తారు.. తమకెందుకు ఇవ్వరని అంటూ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ ప్రస్తావించిన మాటలు వైరల్ అవుతున్నాయి. ఇటీవల ఇద్దరు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులపై సస్పెన్షన్ వేటు వేయగా ఆ మరుసటి రోజే డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌కు సంబంధించిన వీడియో వైరల్ కావడం గమనార్హం. సదరు వ్యాపారి లక్షలు వెచ్చించి వ్యాపారం చేస్తున్నాం.. ఇందులో తమకేమీ మిగలడం లేదని వ్యాపారి అన్నట్లు సంభాషణలో ఉంది.

అసత్య ప్రచారం చేస్తున్నారు

ఈ వీడియోపై డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్ స్పందిస్తూ తన మాటలను కొందరు మార్ఫింగ్ చేసి తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఆ వీడియోలో పార్టీకి ఫండ్ అడిగినట్లుగా ఉందే కానీ ఏ విధంగా వ్యాపారి నుంచి డబ్బులు డిమాండ్ చేసినట్లుగా లేదని పేర్కొన్నారు. ఇటీవలే పార్టీ నుంచి ఇద్దరు వ్యక్తులను సస్పెండ్ చేయడంతో కక్షపూరితంగా తనపై ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని, వాస్తవాలు త్వరలో బయటపడతాయని తెలిపారు.

మైనర్‌పై అత్యాచారం కేసులో వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష

చివ్వెంల(సూర్యాపేట) : బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో వ్యక్తికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా కోర్టు మొదటి అదనపు న్యాయమూర్తి ప్రేమలత గురువారం తీర్పు వెల్లడించారు. వివరాల ప్రకారం .. ఒడిశాకు చెందిన ఓ మహిళ తన భర్త చనిపోవడంతో తన ముగ్గురు పిల్లలను తీసుకుని నేరేడుచర్లకు వచ్చి అక్కడే ఇటుక బట్టీలో పనికి వెళ్లేది. ఈక్రమంలో ఇటుకబట్టీ నిర్వాహకుడు వంటిపులి కోటేశ్వర్‌రావు, ఆమెతో చనువు ఏర్పరుచుకున్నాడు. తనను చూసుకుంటానని, తన పిల్లలను చదివిస్తానని చెప్పాడు. ఈ క్రమంలో ఏప్రిల్ 2021లో ఒడిశాలో ఉన్న తన తల్లిదండ్రులను చూసి వస్తానని చెప్పి పిల్లలను కోటేశ్వర్‌రావు దగ్గర ఉంచి వెళ్లింది. కాగా 6వ వతరతి చదువుతున్న (11) సంవత్సరాల బాలికపై అర్ధరాత్రి సమయంలో తాగిన మైకంలో కోటేశ్వర్‌రావు నోట్లో గుడ్డలు కుక్కి అత్యాచారం చేశాడు. దీంతో బాలిక తెల్లవారు జామున బయటకు వెళ్లి తెలిసిన వాళ్ల ఇంటి దగ్గర ఉంది. మరుసటి రోజు ఇంటికి వచ్చిన తల్లికి జరిగిన విషయమంతా చెప్పడంతో వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అప్పటి డీఎస్పీ రఘు ఆదేశాల మేరకు ఎస్ఐ నవీన్ కుమార్ కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. పలువురు సాక్షులను విచారించిన న్యాయమూర్తి పీపీ త్యాగరాజు వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడికి పోక్సో చట్టం కింద 20 సంవత్సరాల జైలు శిక్షతోపాలు, రూ.10 వేలు జరిమానా విధించింది. పీపీకి లైజన్ ఆఫీసర్ గంపల శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ రవీందర్ సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన డీఎస్పీ, సీఐ, ఎస్ఐలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

కొనసాగుతున్న ఈవెంట్స్

నల్లగొండ క్రైం : మహిళా పోలీసు అభ్యర్థులకు నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా గురువారం రెండో రోజు నిర్వహించిన ఈవెంట్స్‌లో జిల్లావ్యాప్తంగా 1,012 మంది అభ్యర్థులకు 797 మంది హాజరయ్యారు. వీరిలో 327 మంది ఉత్తీర్ణత సాధించారు. 215 మంది అభ్యర్థులు హాజరుకాలేదు. ఈ ఈవెంట్స్‌ను ప్రత్యేక ఎస్పీ శబరీష్ పర్యవేక్షించారు.




రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న మహిళా అభ్యర్థులు, లాంగ్ చేస్తున్న అభ్యర్థి

కొట్టి గాయపరిచినందుకు మూడేళ్లు జైలు

రామన్నపేట : ఇంట్లోని వ్యక్తిని బయటకు లాగి కర్రతో కొట్టి గాయపరచడంతోపాటు, అతని భార్య పట్ల అసభ్యంగా ప్రవర్తించినందుకు ఆరుగురికి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ రామన్నపేట జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ చందన గురువారం తీర్పునిచ్చారు. 2016లో బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ శీనయ్య కేసు నమోదు చేసి సాక్ష్యాలు సేకరించి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితులైన మాండ్ర ముత్యాలు, మాండ్ర లింగయ్య, మాండ్ర లివెందర్, మాండ్ర సింహాద్రి, మాండ్ర విష్ణు, మాండ్ర చంద్రయ్యలకు మెజిస్ట్రేట్ మూడు సంవత్సరాల జైలుశిక్షతోపాటు, జరిమానా విధించింది. బాధితుల పక్షాన ఏపీపీ వెంకట అవినాష్ వాదించారు. నిందితులకు శిక్షపడేలా కృషిచేసిన ఎస్ఐ శీనయ్య, కోర్టు కానిస్టేబుల్ రామాచారిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

ప్రమాదవశాత్తు డీసీఎం దగ్ధం

మిర్యాలగూడ: కోత మిషన్‌తో వినుకొండ నుంచి బోధన్‌కు వెళ్తున్న డీసీఎంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి దగ్ధమైంది. సంఘటన మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వినుకొండ నుంచి కోత మిషన్‌ను బోధన్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో కుక్కడం గ్రామానికి చేరుకోగానే ఒక్కసారిగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే కోత మిషన్‌ను వాహనం నుంచి కిందకు దింపాడు. డీసీఎం వాహనానికి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఫైర్ ఇంజన్‌ను రప్పించి మంటలను ఆర్పారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, డ్రైవర్ చైతన్యకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చివ్వెంల(సూర్యాపేట) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని బి.చందుపట్ల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పారెపల్లి మధు (59) ఈ నెల 6న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం బంధువులకు అప్పగించారు. మృతుడి సోదరుడు సోమేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ విష్ణుమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా.. బాధిత కుటుంబాన్ని మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు, మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ భాషా, భరత్, వైస్ ఎంపీపీ జూలకంటి జీవన్ రెడ్డి, రైతు నర్సింహరావు, తూముల భుజంగరావు తదితరులు ఉన్నారు.

చికెన్ వ్యర్థాల పట్టివేత

బీబీనగర్ : మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద గురువారం తెల్లవారుజామున చికెన్ వ్యర్థాల లోడ్‌తో వెళ్తున్న వాహనాన్ని బీబీనగర్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు మద్దెల సునీల్ తన వాహనంలో చికెన్ వ్యర్థాలను తరలిస్తున్నాడు. అనుమానం వచ్చిన పోలీసులు వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా వ్యర్థాలు ఉన్నాయి. దీంతో వాహనాన్ని బీబీనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యాదాద్రీశుడిని దర్శించుకున్న కెనడా దేశస్తుడు


యాదాద్రి క్షేత్రంలో కెనడాకు చెందిన మార్క్

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయాన్ని కెనడా దేశానికి చెందిన మార్క్ గురువారం దర్శించుకున్నారు. ఉదయం బ్రేక్ దర్శనం సమయంలో యాదాద్రికి చేరుకున్న మార్క్, స్వయంభూలను దర్శించుకొని, అష్టోత్తర పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అధికారులు, ఆచార్యులతో కలిసి ఆలయ నిర్మాణ విశిష్టతను తెలుసుకున్నారు.

సినీఫక్కీలో కారు ఛేజింగ్


పోలీసులకు పట్టుబడిన కారు

పెద్దవూర: అతివేగంగా వెళ్తున్న ఓ కారును పోలీసులు ఛేజింగ్ చేసి పట్టుకోగా.. అందులో గంజాయి లభ్యమైనట్లు సమాచారం. పెద్దవూర ఎస్ఐ పచ్చిపాల పరమేష్ గురువారం ఉదయం 11 గంటల సమయంలో నాగార్జునసాగర్ సర్కిల్ కార్యాలయానికి వెళ్లారు. ఈక్రమంలో స్టేషన్ ఎదుట కానిస్టేబుల్‌తో మాట్లాడుతుండగా ఆంధ్రా ప్రాంతం నుంచి తమిళనాడు రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న నలుపు రంగు కారు పోలీసుల ముందు నుంచి అతివేగంగా వెళ్లింది. అనుమానం వచ్చిన ఎస్ఐ వెంటనే పోలీస్ వాహనం డ్రైవర్‌ను అప్రమత్తం చేసి, సాగర్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసులను తీసుకుని కారును వెంబడించారు. 20 కిలోమీటర్ల దూరం వెంబడించి పెద్దవూరలోని వై జంక్షన్ వద్ద నిందితుడి కారును ఓవర్‌టేక్ చేశారు. నిందితుడు కారు దిగి పక్కనే ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రహరీపై నుంచి దూకి పారిపోతుండడంతో కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐతో పాటు అక్కడున్న యువకులు నిందితుడిని పట్టుకున్నారు. చికిత్స నిమిత్తం నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించి, అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించి పరిశీలించగా అందులో భారీ మొత్తంలో గంజాయి ఉన్నట్లు తెలిసింది. కారులో కిలో సైజు ప్యాకెట్లు వందకు పైగా ఉన్నాయని సమాచారం.

సాక్షి క్లాసిఫైడ్స్

Automobiles

VEHICLE FOR SALE
2020 Model HCV - Tata 3518 Reg. No. TS 05 UD 7827 is Ready for sale in as where is in condition Contact Sundaram Finance Ltd. Nalgonda Cell : 9440909834, 8331998431 [Y-772750]

Services
హౌస్, ఫ్లాట్, ఓపెన్ ఫ్లాట్, ల్యాండ్, వ్యక్తిగత, వ్యవసాయ భూములపై అతి తక్కువ వడ్డీతో ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్స్ కావలెను. ✆ 9988199941. [T-1753]

HEALTH CARE
ఆయుర్వేదం
బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడను. సంప్ర: 9603055647, 7995392747 [G-971]

Real Estate

SHOP FOR SALE
నల్లగొండ LPT మార్కెట్ నందు షాప్ నెం.30లో గల కిడ్స్‌వేర్ స్టాక్ మరియు ఫర్నీచర్‌తో అమ్మబడును. సంప్ర।। 9603509505, 9666431046 [Y-772749]

PLOT FOR SALE
హైదరాబాద్ @ రామోజీఫిల్మ్‌సిటీ దగ్గర కొత్తగూడెం ఫ్రూట్ మార్కెట్ & HMDA లాజిస్టిక్ హబ్ పక్కనే ఉన్న మాస్యూ HMDA వెంచర్‌లో ఇల్లు కట్టుకునే ప్లాట్లు కలవు. Ph: 9666607146 [HA-2408]

Wanted
ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781830]
రివైవ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు పనిచేయుటకు అనుభవం గల ANM/GNM (స్త్రీ/పు) Pharmacist, O.T Technician కావలెను. నకిరేకల్, సెల్: 9951376366, 7893338710 [Y-753135]

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ.:220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
నకిరేకల్ : 9010178203
సూర్యాపేట : 9912220740, 9010422240, 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Sri Chaitanya
EDUCATIONAL INSTITUTIONS, KHAMMAM.
WALK-IN-INTERVIEW

Posts	Min. Qualification
PRINCIPALS	PG in Maths, Physics, Chemistry, English, M.Tech with Atleast 55% of Marks, experience is disired.
Sr. LECTURERS (SL's) (Maths, Chemistry, Botany, English & Sanskrit	PG with Atleast 60% of Marks in concerned Subjects. A minimum of 3 years teaching experience in objective is a must.
VICE PRINCIPALS	Any PG/B.Tech/MBA
FLOOR INCHARGES	Any PG/B.Tech/MBA
JLS (Tutors)	PG in Maths/Sciences/English/Sanskrit/B.Tech
WARDENS (Male & Female)	Any PG/Degree/B.Tech
COMPUTER OPERATORS	M.S.Office/Tally/Typing skills/DTP
A.O.s	Any PG/Degree/B.Tech
Marketing Executives	Any PG/Degree/B.Tech

Mail your resume to Email ID : srichaitanyaec@gmail.com or You can whatsApp Cell : 7995760654, 9542417755, 9951977755.
Interview Date : 18th, 19th Feb., 2023, (10 am to 5 pm)
VENUE : Sri Chaitanya Junior College
Sri Sowdha Campus, Opp. SR & BGNR Degree College, KHAMMAM.